క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



ఏపీఓ పుల్లారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది.

పెద్దవడుగూరు: ఉపాధి ఏపీఓ పుల్లారెడ్డిని గురువారం ఎంపీడీఓ గోపీకృష్ణ, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచినందుకు ఇటీవల ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శేషారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సీజ్ అయిన ట్రాక్టర్లు

యాడికి: మండలంలోని వేములపాడు క్రాస్ వద్ద గురువారం సాయంత్రం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. పెద్ద పప్పూరు మండలం ఇసుక రీచ్ నుం,చి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వాతి లక్ష్మి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం క్రింద గర్భిణులకు డాక్టర్ స్వాతి లక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా డాక్టర్ సూచనల మేరకు చెకప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, మిడ్‌లెవల్ ప్రొవైడర్స్ జ్యోతి, గౌతమి, జయంతి కీర్తి, మంజు భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీధర్ హెచ్చరించారు.గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలపై ఆరా తీశారు. మండలంలో పేకాట, మట్కా పూర్తిగా అరికట్టాలన్నారు. రాత్రి సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గస్తీ పెంచాలన్నారు. 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

ఆలయ నిర్మాణం కోసం గ్రామసభ

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో పురాతన కాలభైరవస్వామి ఆలయ పునఃనిర్మాణం కోసం గురువారం దేవదాయశాఖ ఈఓ శోభారాణి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా పనులను ప్రారంభించడానికి గ్రామసభ ఆమోదం తెలుపుతూ తీర్మాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామయ్య, సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కోర్సులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శశివర్ధన్‌రెడ్డి

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం మదనపల్లి శ్యామలా కృష్ణ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు సంవత్సరాల వ్యవధితో కూడిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీతో పాటు 3 సంవత్సరాల వ్యవధితో కూడిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులపై ప్రిన్సిపాల్ బీ శశివర్ధన్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీసీ హైస్కూల్ హెచ్ఎం కే రామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేసీ బ్రదర్స్‌కు షాక్

- టీడీపీకి 40 కుటుంబాల గుడ్ బై
- వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తాడిపత్రి: యాడికి మండలంలో జేసీ సోదరులకు షాక్ తగిలింది. యాడికి మండలంలోని దైవాలమడుగు గ్రామానికి చెందిన 40 కుటుంబాలు గురువారం తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ కండువాను కప్పుకున్నాయి. తనయుడు అస్మిత్‌రెడ్డితో కలసి జేసీ ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న యువ చైతన్య బస్సు యాత్ర యాడికి మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన బహిరంగ సభతో ముగిసింది. ఆ జోష్‌లో ఉన్న టీడీపీ శ్రేణులతో పాటు జేసీ సోదరులకు అదే మండలంలోని దైవాలమడుగు గ్రామానికి చెందిన, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, కురువృద్ధుడు అయిన భోగాతి బయపరెడ్డి కుమారుడు భోగాతి మోపిరెడ్డి ఆధ్వర్యంలో జగదీశ్వర్‌రెడ్డి, భోగాతి బైపిరెడ్డి, రామకృష్ణ యాదవ్, అశోక్ యాదవ్‌తో పాటు పెద్ద ఎత్తున ఇదే గ్రామం నుంచి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరి జేసీ బ్రదర్స్‌కు గట్టిగానే షాక్ ఇచ్చారు. గురువారం తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంకు చేరుకున్న దైవాలమడుగు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీలోకి చేరిన వారితో కలసి మండల నాయకులు లక్షుంపల్లి సర్పంచ్ పద్మనాభరెడ్డి జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, భోగాతి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చే

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరిన అనంతరం భోగాతి మోపిదేవి మాట్లాడారు. దాదాపు 40 సంవత్సరాల పాటు తమ కుటుంబం జేసీ దివాకర్‌రెడ్డి వెంట నడిచిందన్నారు. నేడు ఆయన సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి అలాంటి నాయకులు, పార్టీలోని కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తన కుటుంబానికి పలు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజల పట్ల చూపుతున్న ఆదరణ బాగుందన్నారు. నాతో పాటు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరిన ప్రతి ఒక్కరి మనసులోని అభిప్రాయం ఇదేనన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు.

'యాత్ర-2' సూపర్ హిట్



థియేటర్ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: 'యాత్ర-2 సినిమా సూపర్ హిట్. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొలిటికల్ జర్నీని దర్శకుడు మహి వి రాఘవ్ కళ్లకు కట్టినట్లు తెరకెక్కించాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం యాత్ర-2 సినిమా విడుదలైన విషయం తెలిసిందే. అభిమానులతో కలసి ఎమ్మెల్యే పుట్లూరు రోడ్డులోని లక్ష్మీనారాయణ థియేటర్‌లో యాత్ర 2 సినిమాను తిలకించారు. అనంతరం థియేటర్ బయట ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. తెలుగు ప్రజలందరికీ వైఎస్ జగన్ రాజకీయ జీవితం చిరపరిచితమేనన్నారు. తండ్రికి ఇచ్చిన మాట నిలబెట్టుకునే క్రమంలో జగన్ ఎదుర్కొన్న సంఘర్షణ, తండ్రి దూరమైన తర్వాత రాజకీయపరంగా ఎదురైన అడ్డంకులను జగన్ ఎదుర్కోవడాన్ని అభిమానులు మెచ్చేలా సినిమాలో చూపించడం హర్షించదగ్గ విషయమన్నారు. వైఎస్.జగన్ పాత్రలో హీరో జీవా ఒదిగిపోయాడన్నారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న కల్పన

గుంతకల్లు: మండలంలోని ఎన్.తిమ్మాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కమ్మరి కల్పన బాల ప్రతిభ సాహిత్య పురస్కార సర్టిఫికెట్‌తోపాటు నగదు బహుమతిని అందుకున్నట్లు హెచ్ఎం నారాయణరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు దాసరి చంద్రమోహన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజన్న సిరిసిల్లా జిల్లాలోని డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్టు బాల ప్రతిభా సాహిత్య పురష్కారానికి కవితా ఆణిముత్యాలు అనే కవితను విద్యార్థి పోస్టు ద్వారా పంపారన్నారు. ఆ కవితకు బహుమతిని పోస్టు ద్వారా పంపారన్నారు. గురువారం అభినంద సభ ఏర్పాటు చేసి విద్యార్థి కల్పనకు అందజేశారు. అలాగే ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అందించిన ప్రశంసా పత్రాన్ని కూడా అందజేశారు. రెండు నెలల కిత్రం తానా వారు కల్పనతో వీడియోకాల్ ద్వారా మాట్లాడి విద్యార్థి ఇచ్చిన జవాబులకు మెచ్చి ప్రశంసా పత్రంను పంపారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మనోహర్, బి.లతామణి, సుజాత, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

29లోపు రెన్యూవల్ చేసుకోండి

తాడిపత్రి అర్బన్: దుకాణాలు, సంస్థలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను ఈ నెల 29లోపు రెన్యూవల్ చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ అధికారి ప్రతాప్‌నాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కింద యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని రెన్యూవల్ చేసుకోకపోతే దుకాణాలు, సంస్థలపై లేబర్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదు



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

గార్లదిన్నె: ఆడపిల్లలపై వివక్ష చూపరాదని సీఐ శ్రీధర్ సూచించారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐతో పాటు ఆర్డీటీ ఎస్‌టీఎల్ అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలికలను చదువు పట్ల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఏటీఎల్ నాగరాజు, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



వెంకట మోహన్(ఫైల్)

గుత్తి: మండలంలోని లచ్చానపల్లికి చెందిన వెంకట మోహన్(37) గురువారం అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గత నెల 28న ఆయన గుత్తి శివారులోని లచ్చానపల్లి రోడ్డులో నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా వెనుక నుంచి బైక్ వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆస్తి తగాదా..ఒకరికి గాయాలు



గాయపడిన రహంతుల్లా

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో అజీజ్, రహంతుల్లా కుటుంబాల మధ్య ఆస్తి తగాదా విషయంలో గురువారం ఘర్షణ చోటు చోటు చేసుకుంది. ఘర్షణలో రహంతుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అజీజ్- రహంతుల్లా కుటుంబాల మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదం నెలకొంది. గురువారం ఇరు కుటుంబాల సభ్యులు ఘర్షణకు దిగారు. అజీజ్, ఖాజా, వలిబాషా, సుధాకర్, ఆశాబీ తదితరులు రహంతుల్లాపై కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఆయన తలకు బలమైన గాయమవడంతో బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేలంలో రూ.46.80 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో దినసరి పబ్లిక్ మార్కెట్, మాంసపు దుకాణాలు, పశు, గొర్రెలు, మేకల వధశాలల నుంచి సుంకం వసూలుకు సంబంధించి వేలం ద్వారా మున్సిపాలిటీకి రూ.46.80 లక్షల ఆదాయం లభించింది. గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆర్ఓ నాసిర్‌హుసేన్ ఆధ్వర్యంలో కమిషనర్ చాంబర్ లో వేలం నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్గాల్లో వీధి విక్రయదారుల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కులను మాచర్ల శివ రూ. 41.85 లక్షలకు దక్కించుకున్నారు. మాంసం దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును రూ.2.52 లక్షలు, జంతు వధశాల (బీఫ్ అంగళ్లు) నుంచి సుంకం వసూలుకు రూ.1.19 లక్షలు, గొర్రెలు, మేకలు (మటన్ షాపు) దుకాణాల నుం,ఇ సుంకం వసూలు చేసుకోవడానికి రూ.1.24 లక్షలకు ఆయనే దక్కించుకున్నారు. పాటదారుల మధ్య పోటీ లేకపోవడంతో వేలాలన్నీ శివ దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే మున్సిపాలిటీకి రూ.31 వేల ఆదాయం పెరిగింది. కార్యక్రమంలో ఆర్ఐ ఎర్రిస్వామి, సీనియర్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు



ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ అధికారులు

తాడిపత్రి అర్బన్: మద్యం సేవించి వాహనాలను నడపరాదని తాడిపత్రి మోటర వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని క్యాబ్స్, ఆటో డ్రైవర్లకు స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ఫోర్ వీలర్ వాహనాన్ని నడిపేటప్పుడు డ్రైవర్లు విధిగా సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, ముందు వెనుక స్టిక్కర్లు అతికించాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. ముఖ్యంగా వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపితే ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహన యజమాని, డ్రైవర్లు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, సంబంధిత రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 35వ వార్డులో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఆరా తీశారు. వార్డుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు నాగభూషణం, పేరం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

12న మండల సమావేశం

యాడికి: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఈ నెల 12న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు హాజరు కావాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



గుంతకల్లులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య



పుట్లూరులో పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని 37వార్డుల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ ఇంజినీర్ గురప్పయాదవ్‌తో కలసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్‌లు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ హేమచంద్ర, ఏఈ హరిక్రిష్ణ పాల్గొన్నారు.

పుట్లూరు: పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ మల్లికార్జునస్వామి సూచించారు. గురువారం ఆయన మండలంలోని తక్కళ్లపల్లి, శనగలగూడూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. అలాగే బీఎల్ఓల నుంచి ఓటర్ల జాబితాపై ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

హిందూ-ముస్లింల ఐక్యతకు ప్రతీక దర్గా



అలంకరణలో మసూద్ గాజీ దర్గా



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సాంబశివారెడ్డి,సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: హిందూ-ముస్లింలకు ఐక్యతగా శింగనమల మసూద్ గాజి దర్గా నిలిచిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శింగనమలలోని మసూద్ గాజీ ఉరుసు సందర్భంగా గురువారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ-ముస్లింలు కలిసి ఈ పండుగన ఘనంగా నిర్వహించుకుంటున్నారన్నారు. ఉరుసును కులమతాలకు అతీతంగా కలసి మెలసి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి నూర్‌మహమ్మద్ ఇంటి దగ్గర నుంచి చక్కెర, పూలుతో ఊరెగింపుగా వెళ్లారు. దర్గాలో చక్కెర చదివించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, సర్పంచ్ నాగమునెమ్మ, వైస్ ఎంపీపీ విజయ, కోఆప్షన్ మెంబర్ ఆలీ, నాయకులు భాస్కర్‌రెడ్డి, జెల్లి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, ఎల్.రాజు, నాగవర్ధన్‌రెడ్డి, భాస్కర్, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌కుమార్, మనోజ్‌కుమార్, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

మసూద్ గాజీ ఉరుసు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గంధం దర్గా చేరిన తరువాత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఇరుసు పందెంలో పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి ఖవ్వాలి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు భారీఎత్తున పాల్గొన్నారు. శుక్రవారం జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దర్గా ముత్తవలి రవూఫ్ తెలిపారు.

30 ఏళ్ల సమస్య పరిష్కారం



దేవరపల్లిలో హిందూ శ్మశానవాటికకు వెళ్లే దారిలో డ్రైనేజీ కాలువ



ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో గరుసుతో దారి ఏర్పాటు చేయించిన దృశ్యం

- ఎమ్మెల్యే చొరవతో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న దేవరపల్లివాసులు

పామిడి: 30 ఏళ్లుగా దేవరపల్లిలో శ్మశాన వాటికకు దారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు పడేవారు. సమస్యను గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి గుర్తించారు. వంకలోని శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న గ్రామ సర్వేనెంబర్ 31-సీ లో రైతు సుధాకర్ వంకవారగా వామిదొడ్డి వేశాడు. దీంతో గత్యంతరం లేక గ్రామస్తులు మృతులను పూడ్చడానికి కంపు కొడుతున్న వంక డ్రైనేజీ నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో మండల అధికారులు కదిలారు. తహసీల్దార్ సమక్షంలో సర్వే చేయించి స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయించారు. రైతు సుధాకర్ కోల్పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని ఏర్పాటు చేయించడంలో ఎమ్మెల్యే సఫలీకృతుడయ్యాడు. అంతేకాకుండా ఎమ్మెల్యే వైవీఆర్ ఎంపీపీ నిధుల కింద రూ. 2 లక్షలతో శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయించారు. దారి సుగమం అవ్వడంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేవు.

డ్రైనేజీ నీటిలోనే వెళ్లాల్సి వచ్చేది



గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల సమస్య కొండలా ఉండేది. ఎందుకంటే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లాలంటే డ్రైనేజీ కాలువలో వెళ్లాల్సి వచ్చేంది. గత్యతంరం లేక కంపుకొడుతున్న ఆ నీటిలోనే ప్రాణం బిగపట్టి అంత్యక్రియలకు వెళ్లి వచ్చేవారం. ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో సమస్య తీరడం చాలా సంతోషంగా ఉంది. -ఎస్ శంకర్, దేవరపల్లి

వెనక్కు వెళ్లే వారం



బంధువులు ఎవరైనా చనిపోతే శ్మశానంలో పూడ్చాలంటే డ్రైనేజీ కాలువ గుండా వెళ్లాలి. కాలువలో పారుతున్న మురుగు నీటితో మహిళలు వెళ్లడం చాలా కష్టంగా ఉండేది. దీంతో సొంతవారు, బంధువులు చనిపోయినా కాలువలో పోవడానికి బయపడి మహిళలు వెనుదిగిరి వచ్చేవారం. ఎమ్మెల్యే చొరవతో సమస్య తీరింది. -ఎస్ ప్రమీలమ్మ, దేవరపల్లి

నేడు 'ఆల్బెండజోల్' పంపిణీ

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మంజుల తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తోందన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాఠశాలలో భోజనం తర్వాత విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు మింగించాలన్నారు. మండల వ్యాప్తంగా 45 ప్రభుత్వ ,16 ప్రైవేట్ పాఠశాలు, 58 అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మందులు వేస్తారన్నారు. మండలంలో 1-19 సంవత్సరాలల్లోపు పిల్లలు 10,477 మంది ఉన్నారన్నారు.

బీఎల్ఓలతో సమావేశం

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఉండాలని, మరణించిన వారి పేర్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.